క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

కంబదూరు: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పాల్గొననున్నారు. ఈ మేరకు మంగళవారం మండల కన్వీనర్ బాలరాజు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6 గంటలకు ముస్లింలు నిర్మించనున్న షాదీఖానాకు భూమిపూజ చేయనున్నారు. 7 గంటలకు స్థానిక చెక్‌పోస్టు నుంచి పలు కాలనీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొననున్నారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పరిశీలన


బ్యాగులను పరిశీలిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్లను డీఎల్‌ఓ గంగాధర్ పరిశీలించారు. కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో భద్ర పరిచిన జేవీకే కిట్లను మంగళవారం ఎంఈఓ విజయకుమారి, ఏపీఎం మంజులతో కలసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాగులు, బెల్టులు, ఇతర సామాగ్రి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే విద్యార్థులందరికీ కిట్లను అందజేస్తామని ఎంఈఓ తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కూడేరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కూడేరుకు చెందిన బ్రహ్మకుమారి ఈశ్వరి విశ్వ విద్యాలయం సంచాలకురాలు వేదావతి అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా పిల్లలకు యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి రాధారాణి, పాఠకులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం


హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

రాయదుర్గంటౌన్: కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న హిందూ ధర్మ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వినాయక సర్కిల్‌లో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని హిందూ ధర్మం పట్ల గౌరవం కలిగి ఉండాలని, లేకపోతే శాశ్వతంగా కనుమరుగుకావడం ఖాయమని వీహెచ్‌పీ అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, కొత్తపల్లి సిద్దప్ప అన్నారు. వీహెచ్‌పీ సహ కార్యదర్శి మన్నానారాయణ, నాగభూషణం, మహేష్, ఆనంద్, శ్రీనివాసులు, వినోద్, కోదండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ డాక్టర్ల సంఘం కన్వీనర్‌గా బసప్ప


బసప్ప


జనార్దన్

బొమ్మనహాళ్: మండల వైఎస్సార్‌సీపీ డాక్టర్ల సంఘం కన్వీనర్‌గా బసప్ప(ఉంతకల్లు), వైఎస్సార్‌సీపీ వికలాంగుల సంఘం మండల కన్వీనర్‌గా జనార్దన్(శ్రీధరఘట్ట) నియమితులయ్యారు. తమ నియామకానికి కృషి చేసిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


ఉరవకొండ: ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం ప్రసంగం వింటున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


రాయదుర్గంటౌన్: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, సిబ్బంది

- ఘనంగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ప్రారంభం

ఉరవకొండరూరల్/ విడపనకల్లు: ప్రజల సమస్యల పరిష్కారమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మాజీ ఎమ్మెల్యే, నియోజకవరగ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ఉరవకొండ ఎంపీడీఓ కార్యలయంలోని సమావేశ భవనంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని విజయవాడలో ప్రారంభించించడంతోపాటు సీఎం ప్రసంగిస్తున్న ప్రత్యక్ష ప్రసారాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు ఆయన తిలకించారు. అనంతరం విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఒక సరికొత్త చరిత్రకు నాంది అన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా నేరుగా ప్రజలు ముఖ్యమంత్రికి తమ సమస్యలను చెప్పుకునే సంస్కృతికి జగన్ శ్రీకారం చుట్టారన్నారు. కార్యకరమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ పార్వతమ్మ, సర్పంచ్‌లు లలితమ్మ, మోనాలిసా, ఉప సర్పంచ్ వన్నప్ప, వైస్ ఎంపీపీ నరసింహులు, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.. అలాగే విడపనకల్లు ఎంపీడీఓ కార్యలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి పాల్గొని జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని తిలకించారు. ఆమెతో పాటు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు నిదర్శనం

రాయదుర్గంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, పారదర్శక, సంతృప్తికరమైన పాలనకు నిదర్శనమే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం అని మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని కమిషనర్ దివాకరరెడ్డితోపాటు విభాగాల వారిగా అధికారులు, సిబ్బందితో కలసి ఆమె వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, సమస్యల పరిష్కారం కోసం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా 1902 టోల్ నెంబర్‌కు ఫోన్ చేసి విన్నవించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ఆందోళన వద్దు


మందులు పంపిణీ చేస్తున్న జిల్లా లెప్రసీ అధికారి అనుపమ జేమ్స్

కూడేరు: కుష్టు వ్యాధి పట్ల భయాందోళన వద్దు. ప్రాథమిక దశలోనే గుర్తించి మందు వాడితే పూర్తిగా నయమవుతుందని జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ అన్నారు. మండలంలోని లెప్రసీ కాలనీలో మంగళవారం కుష్టు, సీజనల్ వ్యాధులపై అవగాహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కుష్టువ్యాధిగ్రస్తులు కాళ్లుచేతులను సబ్బుతో శుభ్రం చేసుకుంటూ ఉంటే వేళ్లకు పుండ్లు ఏర్పడవన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రతలు పాటించాలని సూచించారు. అనంతర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పారా మెడికల్ ఆఫీసర్లు సత్యనారాయణ, సూర్యప్రకాష్ రెడ్డి, తిప్పేస్వామి, మండల సామాజిక అధికారి మోహన్ బాబు, లెప్రసీ నోడల్ అధికారి రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్‌ఎం, ఆశావర్కర్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

రాయదుర్గం: రైతు సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేస్తోందని, తొందరపాటుగా రైతులు దళారులు చెప్పే మాయ మాటలు నమ్మి తక్కువ ధరకు విక్రయించవద్దని రాయదుర్గం వ్యవసాయ ఉప సంచాలకులు (ఏడీఏ) లక్ష్మానాయక్ సూచించారు. మంగళవారం తన కార్యాలయం లో 'సాక్షి'తో ఏడీఏ మాట్లాడారు.. రాయదుర్గం నియోజకవర్గం లోని కణేకల్లు పీఏసీఎస్ ఆధ్వర్యంలో మార్కుఫెడ్, ఆదర్శభారతి సొసైటీ ద్వారా రెండు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం క్వింటాల్‌కు రూ.1,962 తో మద్దతు ధర లభిస్తుందన్నారు. అర్హత కలిగిన రైతులంతా ఈ నెల 12 నుంచి ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అంతకన్న ఎక్కువ ధర పలికితే ఎక్కడైనా అమ్ముకోవచ్చన్నారు. తక్కువకు అమ్ముకోవద్దని హితవు పలికారు. అలాగే విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు కూడా ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. డివిజన్‌లోని ఐదు మండలాలకు 16,300ల క్వింటాళ్ల విత్తన కేటాయింపు జరిగిందన్నారు. క్వింటాల్ వేరుశెనగ రూ.9,300 కాగా, అందులో ప్రభుత్వ రాయితీ రూ.3,720 పోనూ రైతు వాటాగా రూ. 5,580 చెల్లించాల్సి ఉంటుందన్నారు. బస్తా రూ.1647 ఉంటుందన్నారు.

గజేంద్రవాహనంపై వేంకటరమణుడు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం శ్రీవారు గజేంద్ర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై బ్రాహ్మణ సంఘం, వీర శైవలింగాయత్ సంఘం ఆధ్వర్యంలో శ్రీవారి గజేంద్రవాహనం ఆలయం వద్ద నుంచి మొలకాల్మూరు రోడ్డు, వినాయక సర్కిల్, పాతబస్టాండ్ మీదుగా లక్ష్మీబజార్ వరకు ఊరేగింపు నిర్వహించి తిరిగి ఆలయానికి చేర్చారు. పాలకకమిటీ అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు. బుధవారం ఉదయం 11.00 గంటలకు మడుగు తేరు, సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని విడపనకల్లు రైతు సేవా సహకార సంఘం ఎరువుల కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పాల్తూరు, కరకముక్కల, హావలిగి, గాజుల మల్లాపురం, ఉండబండ, చీకలగురికి గ్రామాల రైతులకు విడపనకల్లు రైతు సహకార సంఘం ద్వారా ఎరువులు పంపిణీ చేసేవారని, గత సంవత్సరం నుంచి ఎరువులు అందుబాటులో ఉంచడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించి సొసైటీ ద్వారా ఎరువులను అందుబాటులో ఉంచాలని రైతులు డిమాండు చేశారు.

అర్హులందరికీ విత్తన వేరుశనగ


ఉరవకొండ ఆర్‌బీకేలో మాట్లాడుతున్న ఏడీఏ పద్మజ

విడపనకల్లు(ఉరవకొండ): 2023 ఖరీఫ్‌లో సాగుచేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో విత్తన వేరుశనగను త్వరలో పంపిణీ చేస్తుందని ఏడీఏ పద్మజ అన్నారు. మంగళవారం ఉరవకొండలోని ఆర్‌బీకేలో వ్యవసాయాధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే ప్రతి రైతుకు కూడా సబ్సిడీ ధరతో కే6 రకం విత్తనం పంపిణీ చేస్తామన్నారు. ఉరవకొండ మండలానికి 1700 క్వింటాళ్ళు వేరుశనగ విత్తనం కేటాయించారన్నారు. వేరుశనగ క్వింటాల్ రూ.9,300 ధర ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీతో క్వింటాలక్ష రు.5,580కే అందిస్తుందన్నారు. రైతులు సమీపంలోని ఆర్‌బీకేలో విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శశికళ, ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం చేపట్టండి

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల అటవీ ప్రాంతంలో మొక్కల పెంపకం చేపట్టాలని ఎంపీపీ కమలమ్మ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి కోరారు. ఈ మేరకు మంగళవారం వారు అటవీ శాఖ బీట్ ఆఫీసర్ పరమేశ్వరప్పకు వినతిపత్రం అందజేశారు. కళ్యాణదుర్గం అటవీ శాఖ రేంజ్ పరిధిలోని జంబుగుంపల అటవీ ప్రాంతం ఏడు వేల ఎకరాల్లో విస్తరించి ఉందన్నారు. ఇందులో నడుంబీడు, బోరప్ప కనుమ, మారెమ్మ కొండ, కనుమ కుంట, దావానిపెంట తదితర ప్రాంతాల్లో మొక్కల పెంపకం చేపట్టి అడవి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వారు సూచించారు.

వితంతు, ఒంటరి మహిళలు ఆర్థికంగా ఎదగాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ నిశాంత్ రెడ్డి

కళ్యాణదుర్గం: వితంతు, ఒంటరి మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆర్డీఓ నిశాంత్ రెడ్డి సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం డివిజన్‌లోని వితంతు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు డీఆర్‌డీఏ, బ్యాంకర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు అందించే ప్రోత్సాహంతో ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళలకు అనుకూలమైన, సులభతరమైన లాభసాటి కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మహిళలకు తోడ్పాటు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. బ్యాంకుల నుంచి సబ్సిడీ రుణాలు ఇప్పించేందుకు సహకరిస్తామన్నారు. ప్రతి మహిళా ఆర్థిక భరోసాకు తాము ముందుంటామన్నారు. కార్యక్రమంలో వైకేపీ అధికారులు, వివిధ బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

కూడేరు: గర్భం దాల్చినప్పటి నుంచి ఆరోగ్య సూత్రాలు, జాగ్రత్తలు పాటిస్తే సుఖ ప్రసవం జరిగి మాతా శిశువు సురక్షితంగా ఉంటారని మండల వైద్యాధికారిణి సరిత సూచించారు. మంగవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హైరిస్కు గర్భిణులకు హెల్త్ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు , ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి సీఎం కృషి


మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉన్న సచివాలయం-2 పరిధిలోని కోట వీధి,ఓబయ్య కాలనీ,పాత బస్టాండ్, వైఎస్సార్ సర్కిల్, వడ్డే కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని అంకెల సహా వివరించి బుక్‌లెట్ అందజేశారు. ఆయా కాలనీ వాసులు విద్యుత్ సమస్య, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల ఏర్పాటుపై మంత్రి దృష్టికి తీసుకురాగా.. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో టాపర్లుగా నిలవడం జగనన్న పాలనలోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవిందు, నీలిశంకరప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు, సర్పంచు పద్మావతమ్మ, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, వైస్ ఎంపీపీ భీమేష్, సీనియర్ నాయకుడు సుధీర్, ఎంపీటీసీలు మీ సేవ కుమార్, మల్లేశ్, నాయకులు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, వసంతరాయుడు, విల్సన్, మైనార్టీ నాయకులు ఫయాజ్, మాబుసాబ్, మల్లూరి వెంకటేశులు, బేల్దారి రామకృష్ణ, ఈడిగ పవన్, చంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి


కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ

బ్రహ్మసముద్రం: ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ అప్పస్వామి నాయుడు సూచించారు. మండలంలోని సంజాపురం, తిప్పయ్యదొడ్డి గ్రామాల్లో మంగళవారం ఆయన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ప్రతి కూలీకి రోజుకు రూ.272 కూలి అందిస్తామన్నారు. అనంతరం మస్టర్ల వారీగా కూలీల హాజరును ఆయన పరిశీలించారు. కూలీలందరికి పని కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీఏ అవినాష్, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

పెన్నహోబిలంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు




లక్ష్మమ్మ మంటపం వద్ద మట్టి చదును చేయిస్తున్న అధికారులు, కోనేరులో చెత్తా చెదారం తొలగిస్తున్న దృశ్యం

విడపనకల్లు(ఉరవకొండ): ఉరవకొండ మండలంలోని పెన్నహోబిలంలో మంగళవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రమౌళి అధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పెన్నహోబిలంలోని పలు ప్రాంతాలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకున్నారు. కోనేరు, లక్ష్మమ్మ మంటపం, తేరు బజారు, నర్సరీకి వెళ్ళే దారిలో కంపచెట్లు, ముళ్ళ పొదలు తొలగించడమే కాకుండా రెడ్ గ్రావెల్ వేయించి రోడ్లు చదును చేయించారు. దేవాలయ కమిటీ సభ్యులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న కాపు భారతి

రాయదుర్గంటౌన్: అంబులెన్సు ఢీకొని మృతి చెందిన వడ్రవన్నూరుకు చెందిన పల్లవి కుటుంబ సభ్యులను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి పరామర్శించారు. ప్రమాదంలో పల్లవి మృతి చెందగా తీవ్రగాయాలతో భర్త శివన్న అనంతపురంలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం ఆస్పత్రి వద్ద బాధితులు, మృతురాలి పిల్లలను పరామర్శించి ధైర్యం చెప్పారు. అధైర్య పడరాదని, అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఏడాదిలోపు రెన్యూవల్ చేసుకోవాలి

కూడేరు: క్రాప్‌లోన్ తీసుకున్న రైతులు ఏడాదిలోపు రెన్యూవల్ చేసుకుంటేనే 3 శాతం వడ్డీ వర్తిస్తుందని కూడేరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రమణమ్మ , ఫీల్డ్ ఆఫీసర్ రామానాయుడు మంగళవారం తెలిపారు. బ్యాంక్ పరిధిలో 3,575 మంది రైతులు క్రాప్‌లోన్ తీసుకున్నారన్నారు. గత నెల 11 నుంచి ఇప్పటి వరకూ 2,425 మంది రెన్యూవల్ చేసుకున్నారు. ఇంకా 1150 మంది రైతులు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉందన్నారు.





వేసవి విజ్ఞాన శిబిరం సద్వినియోగం చేసుకోండి

కంబదూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 40 రోజుల పాటు నిర్వహించే వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి సత్యం బాబు సూచించారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం గ్రంథాలయంలో విద్యార్థులకు కథలను చదివి వినిపించారు. అలాగే క్యారమ్స్, చెస్, వైకుంఠపాళి ఆడించారు.

రైతులకు స్ప్రేయర్ల పంపిణీ

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు గ్రామంలో మంగళవారం వ్యవసాయాధికారి పెన్నయ్య అధ్వర్యంలో ప్రభుత్వం రాయితీతో అందజేసిన స్ప్రేయర్లను 13 మంది రైతులకు పంపిణీ చేశారు. అలాగే ట్రాక్టర్‌కు సంబంధించిన వ్యవసాయ పనిముట్లు కూడా సబ్సిడీ ధరతో అందించారు. కార్యక్రమమంలో విడపనకల్లు సొసైటీ చైర్మన్ బోయ శ్రీరాములు, ఎంపీఈఓ మెర్సీ, వైఎస్సార్ సీపీ నాయకులు పి.నాగరాజు, బొరుగుంట్ల గంగన్న, వెంకటేశులు, కుమారుస్వామి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి

గోరంట్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం గొల్లనకుంట నివాసి లింగన్న (30).. గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలోని ఓ క్యాంటీన్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకుని నడుచుకుంటూ వెళుతున్న లింగన్నను పాలసముద్రంలోని గ్రేట్ వే పాఠశాల వద్ద ద్విచక్ర వాహనంపై వేగంగా దూసుకొచ్చిన పుట్టపర్తి నివాసి ఫైరోజ్ ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు వెంటనే హిందూపురంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న లింగన్నను బెంగళూరుకు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక మంగళవారం ఉదయం ఆయన మృతి చెందాడు. ఘటనపై గోరంట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.